అంతటా సంక్రాంతి సందడి


నందిగామలో ప్రయాణికులతో కిక్కిరిసిన ఆర్టీసీ బస్సు


పెనుగంచిప్రోలులో డూడూ బసవన్నల విన్యాసాలు


పేటలో గాలిపటం కొనుగోలు చేస్తున్న చిన్నారి

జగ్గయ్యపేట అర్బన్ : జగ్గయ్యపేటతోపాటు నియోజకవర్గంలోని గ్రామాలు సంక్రాంతి శోభతో సందడిగా మారాయి. వేకువజామునే హరినామ సంకీర్తనలతో హరిదాసులు సందడి చేస్తున్నారు. గంగిరెద్దుల విన్యాసాలతో పల్లెల్లో సంక్రాంతి సందడి నెలకొంది. సంక్రాంతి ముగ్గులలో ఆవుపేడతో చేసిన గొబ్బెమ్మలను అందంగా అలంకరించడంతో ముంగిళ్లు అందమైన లోగిళ్లులుగా మారాయి. సుదూర ప్రాంతాల నుంచి బంధువులు, స్నేహితులు పల్లెలకు చేరుకోవడంతో పాటు, ఉద్యోగాలు, వ్యాపారాలు, చదువుల పేరుతో ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు సైతం సొంత ఊళ్లకు చేరుకోవడంతో గ్రామాలు సందడి సందడిగా మారాయి. స్నేహితులు, బంధువుల రాకతో ఇళ్లన్నీ కళకళలాడుతున్నాయి. పిండి వంటల తయారీ, నూతన వస్త్రాలు కొనుగోళ్లు, ఇళ్లను అందంగా ముస్తాబు చేసే పనిలో ప్రజలు బిజీ బిజీగా ఉన్నారు. పలుసంస్థలు, సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ముగ్గుల పోటీల్లో మహిళలు రంగవల్లులను అందంగా తీర్చిదిద్దుతున్నారు.తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ పండుగను ఎంతో ఆనందంగా జరుపుకునేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటుండటంతో అంతటా సంక్రాంతి సందడి నెలకొంది.

జనంతో కళకళ..

నందిగామ: సంక్రాంతి పండుగ అనగానే గుర్తొచ్చేది పచ్చని పల్లెటూర్లు...సుదూర ప్రాంతాల్లో ఉన్నవారు సైతం సంక్రాంతి పండుగకు సొంతూళ్లకు చేరుకుంటుంటారు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పర్వదినాల్లో నగరాలు వెలవెలబోతుండగా, నందిగామ వంటి పట్టణాలతోపాటు నియోజకవర్గంలోని గ్రామాలు జనంతో కళకళలాడుతున్నాయి. ప్రతి గ్రామంలో సందడి వాతావరణం కనిపిస్తుంది. కొత్త అల్లుళ్ల రాక, కుటుంబ సభ్యులందరి కలయికతో సందడి నెలకొంది.


పెనుగంచిప్రోలులో పిండివంటలు వండుతున్న మహిళలు


పాతపేటగడ్డ వీధిలో రంగవల్లులను తీర్చిదిద్దుతున్న మహిళలు

రెండు రోజులుగా నందిగామ నియోజకవర్గ పరిధిలోని గ్రామాలకు సుదూర ప్రాంతాల నుంచి కుటుంబసభ్యులు, బంధుమిత్రులు తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్రామంలో పండుగ వాతావరణం కనిపిస్తోంది. సంక్రాంతి సెలవుల నేపథ్యంలో శనివారం నందిగామ బస్టాండ్ ప్రయాణికులతో రద్దీగా కనిపించింది. బస్సులన్నీ ప్రయాణికులతో కిటకిటలాడాయి.

గ్రామాల్లో సందడి..

పెనుగంచిప్రోలు: గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. పట్టణాల్లో యాంత్రిక జీవనం నుంచి తప్పించుకునేందుకు పండుగను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి జరుపుకునేందుకు ప్రజలు గ్రామాలకు చేరుకుంటున్నారు. మహిళలు సామూహికంగా అరిసెలు, చక్రాలు వండుతుండటం గ్రామాల్లో కనిపించింది.

ఉత్కంఠగా పొట్టేళ్ల పోటీలు


గండేపల్లిలో పొట్టేళ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్

కంచికచర్ల(వీరులపాడు): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పొట్టేళ్ల పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు పరిటాల రామకోటేశ్వరరావు, నల్లిబోయిన తిరుమలరావు, యాదవ సంఘం ఆధ్వర్యంలో మండలంలోని గండేపల్లిలో నిర్వహిస్తున్న నాటు గొర్రె పొట్టేళ్ల పోటీలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ అందరూ సంప్రదాయ క్రీడలతో పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. అసాంఘిక క్రీడలకు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా సంక్రాంతి పండుగ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకని ప్రతిఒక్కరూ పండుగను ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలంటూ అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. పరిటాల వీరభద్రరావు, ఉగ్ర నరసింహ, జంగాల సంమేశ్వరరావు, పరిటాల వీరరాఘవులు, ఆవులదొడ్డి బసవయ్య, యరగొర్ల రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రజలకు భోగి పండుగ శుభాకాంక్షలు




జగ్గయ్యపేట అర్బన్, నందిగామ టౌన్: జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గ ప్రజలు భోగి పండుగను సంతోషంగా జరుపుకోవాలంటూ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు అందరికీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అందరూ సుఖసంతోషాలు, భోగభాగ్యాలు కలిగి ఉండాలని..అన్నదాతలు పాడిపంటలు, సిరిసంపదలతో తలతూగాలని వారు ఆకాంక్షించారు.

గోవుల సంరక్షణకు విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు శనివారం గ్రామానికే చెందిన అందలం వెంకటరమణ, సీతామహాలక్ష్మి దంపతుల కుమారుడు ఆదర్శ్ గోపాల్ రూ.10.116ను శనివారం విరాళంగా అందజేశారు. ఈ మేరకు నగదును ఆలయ అధికారుల చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

చెక్‌పోస్టు పరిశీలన

గరికపాడు(జగ్గయ్యపేట): రాష్ట్ర సరిహద్దు గరికపాడు చెక్‌పోస్టును శనివారం రాత్రి విజయవాడ డీసీపీ అజిత వేజండ్ల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ నుంచి ఏపీకి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే అనుమతిస్తున్నట్లు చెప్పారు. సర్కిల్ పరిధిలో తెలంగాణ సరిహద్దు గ్రామాల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని పోలీసులకు సూచించారు. కార్యక్రమంలో నందిగామ ఏసీపీ జనార్దన్ నాయుడు, సీఐ జానకి రామ్, ఎస్‌ఐ కృష్ణబాబు పాల్గొన్నారు.


నేడు నవాబుపేటలో సంక్రాంతి పోటీలు

నవాబుపేట(పెనుగంచిప్రోలు): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని గ్రామంలో స్నేహ సమాజం సర్వీస్ సొసైటీ, ఎల్‌వీఆర్ ఛారిటీ వారి సంయుక్త ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న ఉదయం గ్రామస్థాయిలో పెద్దలకు స్లోసైక్లింగ్, స్లోబైకింగ్ పోటీలు ఉంటాయన్నారు. సాయంత్రం 7 గంటలకు చిన్నారులకు భోగిపళ్ల కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే 15వ తేదీన ఉదయం 10 గంటల నుంచి ఎన్టీఆర్ జిల్లా స్థాయిలో మహిళలకు ముగ్గుల పోటీలు, సాయంత్రం 14ఏళ్ల లోపు పిల్లలకు తెలుగమ్మాయి పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. రాత్రి 8 గంటల నుంచి బహుమతి ప్రదానోత్సవం, చిన్నారులచే డాన్స్‌బేబీ డాన్స్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మద్యం అక్రమంగా విక్రయిస్తున్న ఇద్దరిని కొత్తపేట పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 39 క్వార్టర్ బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేటలో ఓ మహిళ మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు పేటలో తనిఖీ నిర్వహించగా, కోలా సరోజిని అనే మహిళ మద్యం విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీంతో ఆమెను అరెస్ట్ చేసి 9 క్వార్టర్ బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇక వైఎస్సార్ కాలనీలో మద్యం విక్రయిస్తున్న కొనదల సుబ్బారావు అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 30 క్వార్టర్ బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

పేదలకు చీరల పంపిణీ



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భారతీయ అంతరిక్ష తొలి వ్యోయగామి రాకేష్ శర్మ 75వ పుట్టిన రోజును పురస్కరించుకుని శనివారం పేదలకు చీరల పంపిణీ జరిగింది. కేఎల్ రావునగర్‌లోని రాకేష్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్వీ రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు లాంగ్ లీవ్ రాకేష్ శర్మ అంటూ నినాదాలు చేశారు. దేశంలోనే తొలి అంతరిక్ష వ్యోయగామి రాకేష్ శర్మ ఆనాటి సాంకేతికత పరిజ్ఞానానికి చిహ్నమని, రాకేష్ శర్మ నిడారంబరత, దేశానికి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు బిస్కెట్లు, పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రేణుకాదేవి, స్కూల్ ఉపాధ్యాయులు మల్లేశ్వరి, మహారాజ్, మమత, షకీలా, ధనలక్ష్మి, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధిపథంలో శనగపాడు


ప్రారంభానికి సిద్ధమైన శనగపాడు సచివాలయ భవనం


శనగపాడులోని రైతుభరోసా కేంద్రం


రూ.39లక్షలతో నిర్మించిన సొసైటీ భవనం

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోట్లాది రూపాయలతో పనులు..
- నాడు–నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు
- పెరిగిన మౌలిక వసతులు
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు




మారిన ప్రాథమిక పాఠశాల రూపురేఖలు

శనగపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని శనగపాడు మున్నుపెన్నడూ లేనివిధంగా అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది. మండల శివారు గ్రామంగా ఉన్న శనగపాడులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ నాలుగున్నరేళ్ల పాలనతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారు. తద్వారా శనగపాడు గ్రామస్తులకు మౌలిక వసతులు కల్పించారు.

రూ.2.25కోట్లతో పాఠశాలల అభివృద్ధి..

నాడు–నేడు పథకం ద్వారా శనగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.2కోట్లతో పనులు చేపట్టారు.

పాఠశాలలో 12 తరగతి గదుల నిర్మాణంతోపాటు విద్యార్థులకు అవసరమైన మౌలికవసతులు కల్పిస్తున్నారు. వంటగది, టాయిలెట్ బ్లాక్ నిర్మాణం చేపట్టారు. ప్రాథమిక పాఠశాలలో కూడా రూ.25లక్షలతో పనులు చేపట్టారు. దీంతో గ్రామంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల నూతనశోభను సంతరించుకుంటున్నాయి. కార్పొరేట్ పాఠశాలలను మించి విద్యార్థులకు వసతులు కల్పిస్తుండటంతో ఈ నాలుగేళ్లలో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య సైతం పెరిగింది.

రూ.45లక్షలతో సచివాలయ నిర్మాణం..

రూ.45 లక్షలతో చేపట్టిన సచివాలయ భవన నిర్మాణం పూర్తి కావచ్చింది. త్వరలో ప్రారంభోత్సవం జరిపేందుకు స్థానిక నాయకులు, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే) రైతులకు విస్తృత సేవలు అందిస్తోంది.

మంచినీటి పైపులైన్ నిర్మాణం..

గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం శిథిలావస్థకు చేరుకోవడంతో జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను సహకారంతో రూ.39 లక్షలతో నూతన భవనం నిర్మాంచారు. ఈ సొసైటీ ద్వారా రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలకు కోట్లాది రూపాయలను రుణాలుగా అందిస్తూ వారి అభ్యున్నతికి దోహదపడుతున్నారు. ప్రభుత్వం సైతం వడ్డీ మాఫీ ద్వారా రైతులు, డ్వాక్రా సంఘాలకు అండగా నిలుస్తోంది.

గ్రామంలోని మంచినీటి ఇబ్బందులను తొలగించేందుకే సీఎం జగనన్న ప్రభుత్వం రూ.25 లక్షలతో పైపులైన్ ఏర్పాటు చేసింది.తద్వారా గ్రామస్తుల మంచినీటి ఇక్కట్లు తొలగాయి. రూ.10 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు నిర్మాణం చేశారు. 75మందికి జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు ఇళ్లు మంజూరు చేశారు.

సొసైటీ భవనాన్ని నిర్మించుకున్నాం



శిథిలమైన సొసైటీ భవనం పరిస్థితిని ఎమ్మెల్యే ఉదయభాను దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి రూ.,39లక్షలు మంజూరు చేయించారు. దీంతో ఆధునిక వసతులతో నూతన భవనం నిర్మించుకున్నాం. రూ.2కోట్ల నిధులతో జెడ్పీ హైస్కూల్‌కు కూడా అభివృద్ధి చేస్తున్నాం.

– పారుపల్లి నాగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు

మునుపెన్నడూ చూడని అభివృద్ధి..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శనగపాడు గ్రామంలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేయడం సంతోషంగా ఉంది. ఇంత పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం.

– కీసర లోకేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు

కోడిపందేల నిర్వహణపై పోలీసుల ప్రత్యేక నిఘా

నందిగామ: సంక్రాంతి పండుగ నేపథ్యంలో నందిగామ డివిజన్‌లో కోడిపందేల నిర్వహించకుండా పోలీసులు పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. సంక్రాంతికి సంప్రదాయాల ముసుగులో కోడిపందేల నిర్వహించినా, సహించేది లేదని పోలీసు ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. కోడి పందేల జరగకుండా డివిజన్ పరిధిలో పోలీసులు ముందుగానే ప్రతి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కోండిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తున్నారు. ఈ ఏడాది ఎట్టి పరిస్థితుల్లో కోడిపందేలు జరగకుండా అడ్డుకునేందుకు పోలీసులు పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టారు.

గతేడాది 49 కేసులు..

సంక్రాంతి సందర్భంగా ఈ ఏడాది కోడిపందేలను అడ్డుకునే చర్యల్లో భాగంగా డివిజన్ పరిధిలో ఇప్పటికే 167 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు ఏసీపీ జనార్దన్‌నాయుడు తెలిపారు. గతేడాది పందేలు నిర్వహించే 139 మందిపై 49 కేసులు నమోదు చేసిన పోలీసులు, 68పందెం కోళ్లతోపాటు పందేలలో కోళ్లకు కట్టే 66కత్తులను స్వాధీనం చేసుకున్నారు. పలు వాహనాలతోపాటు నగదును స్వాధీనం చేసుకుని పందేల నిర్వహణను అడ్డుకున్నారు. ఈ ఏడాది కూడా డివిజన్ పరిధిలో కోడిపందేలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఏసీపీ తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే అన్ని గ్రామాల్లో కోడిపందేలు జరగకుండా ప్రచారం చేయడంతోపాటు కౌన్సెలింగ్ కూడా ఇచ్చినట్లు వివరించారు. డివిజన్ పరిధిలో ఎక్కడైనా పందేలు నిర్వహిస్తే, ఆ సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.


కోడిపందేలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ ప్రచారం చేస్తున్న పోలీసులు

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణోత్సవం శనివారం వైభవంగా జరిగింది. బ్రాహ్మణవీధిలో దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి వారి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ధనుర్మాసం, అందులోనూ స్వామి వారికి ప్రీతికరమైన శనివారం శ్రవణ నక్షత్రం కావటంతో అత్యంత పవిత్రమైనదిగా భావించి భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో తీసుకువచ్చి కల్యాణ వేదికపై వేంచేయించారు. అనంతరం ఆలయ అర్చక స్వాములు పి.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేన పూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞపవీతధారణ, జీలకర్ర బెల్లం ధారణ, మంగళ్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ప్రత్యేకాలంకరణలో స్వామివారు

వైభవంగా తిరుమంజనం

స్వామి వారి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకొని ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్ కు తిరుమంజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామి వారిని అభిషేకించారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక అలంకారం చేశారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. వైదిక కార్యక్రమాలను కార్యనిర్వహణాధికారి ఘంటసాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

ఆకట్టుకుంటున్న సంక్రాంతి రంగవల్లులు

- ధనుర్మాసంలో ముగ్గులకు ప్రాధాన్యం
- ప్రత్యేకాకర్షణగా సంక్రాంతి ముగ్గులు


పెనుగంచిప్రోలులో రంగవల్లి తీర్చిదిద్దుతున్న గృహిణి


సంక్రాంతిని ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన ముగ్గు

పెనుగంచిప్రోలు: ధనుర్మాసంలో ఇళ్ల ముందు ముగ్గులు పెట్టడం సంప్రదాయంగా వస్తోంది. నెల పొడవునా ప్రారంభమైన ముగ్గులు భోగి పండుగ రోజుతో ముగ్గులు పెట్టడంతో ముగుస్తుంది. పెళ్లి కావాల్సిన యువతులు ఇళ్ల ముందు ముగ్గులు వేసి గొబ్బిళ్లతో పూజలు చేయడం ద్వారా మంచి వరుడు వస్తాడని ఆండాళ్ తల్లి పావన చరిత్ర ద్వారా తెలుస్తోంది. భోగి రోజున గొబ్బెమ్మ ముగ్గు, సంక్రాంతి రోజున పూర్ణకుంభం, కనుమ రోజున రథం ముగ్గు వేయటం ఆనవాయితీగా వస్తోంది.

మారుతున్న పద్ధతులు..

చేతివేళ్ల మధ్యలో నుంచి ముగ్గును జారవిడిచి చుక్కలు, గీతలతో ముగ్గులు వేయటం సాధారణ పద్ధతి. అయితే మారుతున్న కాలానికనుగుణంగా అనేక పద్ధతులు వచ్చాయి. ముగ్గు, రకరకాల రంగు పొడర్లు, పెయింట్లు, బ్రష్‌లు, జల్లెడ ముగ్గు, డబ్బా ముగ్గు, అచ్చులు, స్టిక్కర్లు కొనుగోలు చేస్తున్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు..

సంక్రాంతి సంబరాల్లో భాగంగా పలు సంఘాలవారు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ కార్యక్రమాల్లో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. మహిళలు, యువతులు ఎంతో ఉత్సాహంగా ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. గ్రామాల్లో సీసీ రోడ్లపై, మట్టి రోడ్లపై పోటీలు నిర్వహిస్తున్నారు. పట్టణాల్లో కూడా రోడ్లపైన, విశాలమైన మైదనాల్లో నిర్వహిస్తున్నారు. ముగ్గులను కూడా రకరకాల రంగులతో దిద్దటంతో పాటు సంక్రాంతి పండుగ ఉట్టిపడేటట్లు పాలు, పొంగళ్లు, చెరకు గడలు, పిండివంటలు, కూరగాయలు కనేపడేటట్లు ముగ్గులు దిద్దుతున్నారు. గతంలో ముగ్గులు కేవలం తెలుపు రంగులో ఉండేవి. ఇప్పుడు ఖర్చుకు కూడా వెనుకాడకుండా రంగులు అద్దటంతో పాటు ముగ్గుల కోసం నెట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవడం, దిన పత్రికలో వచ్చే ముగ్గులను నేర్చుకుంటున్నారు.

ముగ్గులతో ముడిపడిన శాస్త్రీయ అంశాలెన్నో..

ముగ్గులు వేయడంలో అనేక శాస్త్రీయ అంశాలు చోటుచేసుకున్నాయి. ముగ్గులు వేసే సమయంలో వ్యాయామం ద్వారా శారీరక శ్రమ కలుగుతుంది. ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తుంది. బియ్యపు పిండితో ముగ్గులు వేయటం ద్వారా అనేక చిన్న జీవ రాశులకు ఆహారం వేసినట్లే అనే భావన ఉంది. ముగ్గులు వేయడంతో మన సంస్కృతితో పాటు సైన్స్ కూడా ఉందని భావించవచ్చు.

ముగ్గుల పోటీల్లో పాల్గొంటాను



ముగ్గులు వేయడం మన సంస్కృతిలో భాగం. ముగ్గులు వేయడమంటూ నాకు చాలా ఇష్టం. గ్రామంలో జరిగే పోటీల్లో మాత్రమే కాకుండా చుట్టు పక్కల ఏగ్రామంలో జరిగినా పోటీల్లో పాల్గొంటాను. పలుమార్లు బహుమతులు కూడా గెలుచుకోవడం సంతోషంగా ఉంది.

–ఎల్‌వీ పార్వతి, నవాబుపేట

చిన్నప్పటి నుంచి ముగ్గులంటే ఇష్టం



ముగ్గులు అంటే చిన్నతనం నుంచి ఎంతో ఇష్టం. దినపత్రికల్లో వచ్చే ముగ్గులను ప్రాక్టీస్ చేసి ఇళ్ల ముందు వేస్తున్నా. ముఖ్యంగా భోగి, సంక్రాంతి, కనుమ రోజు ఇంటి ముందు పెద్ద ముగ్గులు వేస్తాం. రకరకాల రంగులతో ముగ్గులు అద్ది గొబ్బిళ్లను పెట్టి పూజలు చేస్తాం.

–దివ్వెల నాగరాజా, పెనుగంచిప్రోలు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 19వ తేదీన ప్రారంభించనున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు పోలిమెట్ల శరత్‌బాబు కోరారు. 62వ డివిజన్ ఎల్‌బీఎస్ నగర్‌లోని మూడుబొమ్మల సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మితో కలిసి శనివారం ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నగరం నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని రూ. 404 కోట్లతో దేశంలో ఎక్కడా లేనివిధంగా ఏర్పాటు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందని అన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలను ఏకతాటిపై నడిపిస్తున్న సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా ఆవిష్కరించనున్న ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావాలని కోరారు. అనంతరం అంబేడ్కర్ చిత్రపటాలను స్థానికులతో కలిసి ప్రదర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు హైమావతి, నాగిరెడ్డి, దుర్గా, కె.జ్యోతి, ఎస్సీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేళ్ల సంగీతబాబు, సహాయ కార్యదర్శి థామస్, మిట్ట నాగార్జున పాల్గొన్నారు.

కనులపండువగా తోటోత్సవం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గోదా, రంగనాథుల తోటోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆస్థాన కల్యాణ మండపంలో నిర్వహించిన తోటోత్సవంలో శారదా నృత్య కళా పీఠంకు చెందిన పలువురు చిన్నారులు గోదా వైభవం నృత్య రూపకాన్ని ప్రదర్శించారు.